

కొత్త కొత్తగా..
ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభమయ్యాయి. జీవితాన్ని మలుపుతిప్పే ఇంటర్‌లో ఆకర్షణకు గురైతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. 8లో▸



దీవించమ్మా..
జిల్లాలో ఆదివారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బోనాలు తీశారు. డప్పు చప్పుల మధ్య గ్రామస్తులు గ్రామదేవతలకు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0 /26.0
ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పశ్చిమ నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

గంగమ్మతల్లి ఒడికి మల్లన్న స్వామి



నదిలో పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం అగ్నిగుండాల పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రతియేటా తొలి ఏకాదశి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు వేడుకలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఖేతమ్మ, భ్రమరాంబిక మల్లన్నస్వామికి పవిత్ర గోదావరినదిలో గంగస్నానం చేయించారు. డప్పుచప్పుళ్ల మధ్య మల్లన్నస్వామిని ఒగ్గు పూజారుల నేతృత్వంలో గోదావరినదికి తీసుకెళ్లారు. భక్తులు గోదావరి స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించారు. సోమవారం పెద్దపట్నం వేసి ఒగ్గు పూజారులతో సంప్రదాయ బద్ధంగా మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం అగ్నిగుండాల్లో భక్తులు నిప్పులపై నడుస్తారు. మూడు రోజులపాటు జరిగే ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ఎంసీసీ క్వారీలో ఉన్న దుర్గాదేవి అమ్మవారిని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ప్రత్యేక అర్చన, హారతి ఇచ్చారు. అనంతరం ఈ నెల 21న జాతర నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సౌకర్యాలు కల్పించాలని గఢ్‌పూర్ కార్యదర్శి శ్రావణ్‌కు సూచించారు. పార్కింగ్, దుకాణ ఏర్పాట్ల సమస్యలు లేకుండా చూడాలని, మంచినీరు, నీడ వసతి కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాధ్యతలు చేపట్టిన సీఓఈ ప్రిన్సిపాల్



శ్రీనివాస్‌కు శాలువాతో సన్మానం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా మంగళంపల్లి శ్రీనివాస్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఖమ్మం జిల్లా ముదిగొండ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాలకు, హుస్నాబాద్ సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బెల్లంపల్లికి బదిలీ కావడం తెలిసిందే. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సీఓఈ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యార్థుల డార్మెటరీ, వంటశాల, తరగతి గదులు, క్రీడా మైదానం పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధగా చదవాలని సూచించారు.

ప్రైవేటు నుంచి సర్కారు బడికి..



గొల్లపల్లిలో హెచ్‌ఎం, స్థానికుల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల నుంచి 24మంది విద్యార్థుల చేరికకు తల్లిదండ్రులు అంగీకారం తెలిపారు. ఆదివారం దొనబండ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం, నోడల్ అధికారి జి.హన్మాండ్లు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. ప్రభుత్వ బడిలో విద్యార్థుల చదువుకు తీసుకుంటున్న చర్యలు, వసతుల కల్పనపై వివరించారు. పిల్లలను చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భరోసానిచ్చారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులు, స్థానికులతో కలిసి తీర్మానం చేశారు. 24మంది విద్యార్థులను గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ముందుకు వచ్చి అంగీకార పత్రాలు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటస్వామి పాల్గొన్నారు.

పార్కుల పనులకు గ్రహణం



రాముని చెరువు వద్ద ఉన్న పిల్లల పార్కులో పిచ్చి మొక్కలు పెరిగి, తుప్పు పట్టిన పరికరాలు



తుప్పు పట్టిన పిల్లల ఆట పరికరాలు



శిథిలమైన గోడకు సున్నం

- రూ.లక్షల్లో ఖర్చు.. కానరాని ఆహ్లాదం
- కొన్నింటిలో సగం పనులతోనే సరి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని పార్కులకు గ్రహణం పట్టింది. పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పెద్దమొత్తంలో పట్టణప్రగతి నిధులు కేటాయించినా అధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని చోట్ల పనులు నామమాత్రంగా చేయగా.. మరికొన్ని చోట్ల ముందుకు సాగడం లేదు. రూ.లక్షల్లో నిధులు కేటాయించి పార్కులు అభివృద్ధి చేశామని చెబుతున్నా ఎక్కడా ఆహ్లాదం కనిపించడం లేదు. పార్కుల అభివృద్ధిని పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా.. కేటాయించిన నిధులు, చేసిన పనులకు పొంతలేదని పైపై మెరుగులు దిద్దారనే ఆరోపణలున్నాయి.

పాతవాటికే రంగులు..

పాత మంచిర్యాల, హైటెక్‌సిటీ కాలనీల్లోని పార్కుల పనులు పూర్తి చేసేందుకు రూ.90లక్షలు, రూ.80 లక్షలు కేటాయించారు. పాతవాటికే రంగులు అద్ది నిధులు ఖర్చు చేసినట్లుగా చూపించారు. పాతమంచిర్యాల పార్కుకు రూ.90లక్షలతో పచ్చదనంతో కూడిన, చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచేలా అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా.. కేవలం వాకింగ్ ట్రాక్ వేసి, రేకులతో షెడ్డు నిర్మించి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. చుట్టూ ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరగా సున్నం వేసి పార్కును ప్రారంభించారు. పార్కులో గతంలో ఉన్న చెట్ల వద్ద గడ్డి మొక్కలు తొలగించినా ఆహ్లాదాన్నిచ్చే మొక్కలు ఇతరత్రా సదుపాయాలు కల్పించలేదు. రూ.90లక్షలతో పైపై మెరుగులు దిద్దారనే ఆరోపణలున్నాయి.

- హైటెక్‌సిటీ కాలనీలోనూ రూ.50లక్షలతో చిన్న పిల్లల పార్కు పనులు చేపట్టగా అందులో వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునే మూడు రకాల వస్తువులతో పనులు పూర్తి చేశారు. అందులో గతంలోనే గది, చుట్టూ ప్రహరీ ఉన్నాయి. చేపట్టిన పనులు తక్కువే అయినా ఖర్చు చేసిన నిధులు చాలా ఎక్కువనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పాతమంచిర్యాలలోని పార్కులో పిచ్చి మొక్కలు

- జిల్లా కేంద్రంలోని పాతగర్మిళ్ల పార్కుకు రూ.65 లక్షలు కేటాయించి అప్పటి అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఒక బోరు మాత్రమే వేసి.. పనులు ప్రారంభించలేదు.
- రాజీవ్‌నగర్‌లో రూ.60లక్షలు కేటాయించి పనులు ప్రారంభించి సగమే పూర్తి చేశారు. రూ.లక్షల్లో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టినా ఆహ్లాదం కనిపించడం లేదు.

నిర్వహణ లేక పరికరాలకు తుప్పు

జాఫర్‌నగర్‌లోని రామునిచెరువు కట్టను ఆనుకుని పిల్లల పార్కు, రూ.10లక్షలతో చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరికరాలు తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. ఆ ప్రాంతం మొత్తం పిచ్చిమొక్కలు పెరిగాయి. పిల్లలకు పూర్తి స్థాయిలో పరికరాలు ఏర్పాటు చేసి ఆహ్లాదంగా గడిపేలా రూ.80లక్షలు కేటాయించినా పనులు ప్రారంభించలేదు. జిల్లా కేంద్రంలోని ఏకైక పిల్లల పార్కు ఇదే. పనులు పూర్తి చేస్తే సెలవుల్లో పిల్లలు సరదాగా గడిపేందుకు, ఆడుకునేందుకు ఉపయోగపడేది. టెండర్‌లో పేర్కొన్న పరికరాలన్నీ తీసుకు రావాల్సి వస్తుందనే ఏళ్లు గడుస్తున్నా పనులకు మోక్షం కలగడం లేదు.

మంచిర్యాలలోని పార్కుల అభివృద్ధికి కేటాయించిన పట్టణ ప్రగతి నిధులు

పార్కులు	నిధులు (రూ.లక్షల్లో)
పాతమంచిర్యాల పార్కు	90
రాముని చెరువు పిల్లల పార్కు	80
హైటెక్‌సిటీ ప్లేగ్రౌండ్ పార్కు	80
హైటెక్‌సిటీ పార్కు	50
గర్మిళ్ల పార్కు	65
రాంనగర్ పార్కు	60
రాజీవ్‌నగర్ పార్కు	60
రెడ్డి కాలనీ పార్కు	40

పనులన్నీ పూర్తి చేస్తాం

పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించి, గుర్తించిన పనులు పూర్తి చేశాం. రాజీవ్‌నగర్, గర్మిళ్ల, రామునిచెరువు చిన్న పిల్లల పార్కు పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తయిన పార్కుల్లో ఆహ్లాదం అందేలా చేస్తాం. గుర్తించిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా పనులు ప్రారంభించని చోట, పనులు జరిగేలా చూడడంతోపాటు పార్కుల్లో ఆహ్లాదం పంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.
– మధుకర్, మున్సిపల్ డీఈ, మంచిర్యాల

కట్టెల పొయ్యే దిక్కు!



మంచిర్యాల బాలుర హైస్కూల్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న కార్మికులు

- సర్కారు బడిలో 'మధ్యాహ్న' వంట.. తంటా..
- అటకెక్కిన గ్యాస్ స్టవ్‌ల సరఫరా
- హాస్టళ్లలో గ్యాస్ స్టౌలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకు మౌలిక వసతులు కరువై ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పెరుగుతున్న కూరగాయల ధరలు.. బిల్లులు సకాలంలో రాక.. వంట గదులు లేక.. నీటి సమస్యతో అవస్థలు పడాల్సి వస్తోంది. కట్టెల పొయ్యిపై వంటతో పొగ నేరుగా కళ్లలోకి వెళ్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఆరుబయట.. మరికొన్ని చోట్ల ఇళ్లలోనే వండి తేవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించినప్పటి నుంచి గ్యాస్ ఇస్తామని చెబుతున్నా నేటికీ అమలుకు నోచుకోలేదు. వసతితో కూడిన విద్యాలయాలు, హాస్టళ్లలో గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా.. సర్కారు బడులకు కట్టెల పొయ్యే దిక్కవుతోంది.

మధ్యాహ్న భోజనం ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వంట బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించింది. ఆరంభంలో ఆరుబయట వంట చేసేవారు. తర్వాత కాలంలో ఒక గది నిర్మించి రేకుల షెడ్డు మాదిరిగా ఏర్పాటు చేశారు. నెమ్మదిగా వంటగదితోపాటు తాగునీరు, గ్యాస్ అందించాలని సంకల్పించినా అమలుకు నోచుకోలేదు. ఒకే గదిలో స్టోర్‌రూం, వంటపొయ్యి(కట్టెల పొయ్యి) ఏర్పాటుతో పొగ బయటకు రాక ఊపిరి సలపని పరిస్థితి ఎదురవుతోంది. ఇంకోవైపు కొన్ని పాఠశాలల్లో నీటి సరఫరా లేక మధ్యాహ్న భోజనం బంద్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల హమాలీవాడ ప్రాథమిక పాఠశాలలో నీటి సరఫరా లేక విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బంద్ చేసిన విషయం తెలిసిందే. గర్ల్స్ హైస్కూల్‌లో బోర్‌వెల్ నీరు అడుగంటడంతో మున్సిపల్ ట్యాంకర్ నీటిపై ఆధారపడుతున్నారు. ఇలా ఒక్కో పాఠశాలలో ఒక్కో సమస్య నెలకొంది.

గ్యాస్‌సరఫరా ఎప్పుడో..?

మధ్యాహ్న భోజనం ఆరంభంలో గ్యాస్ పొయ్యి(స్టవ్)లు పంపిణీ చేశారు. 748 పాఠశాలలో కేవలం 71 పాఠశాలలకు మాత్రమే గ్యాస్ పంపిణీ చేశారు. బెల్లంపల్లి 28, కాసిపేట 4, మందమర్రి 8, చెన్నూర్ 14, జన్నారం 8, తాండూర్ 9 పాఠశాలలకు మాత్రమే గ్యాస్ సరఫరా చేశారు. మొదట్లో గ్యాస్ సరఫరా చేసిన తర్వాత అటకెక్కాయి. మిగిలిన పాఠశాలలకు గ్యాస్, స్టౌ పంపిణీ విస్మరించారు. దీంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. వంట సమయంలో పొగతో కార్మికులతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. కట్టెలు దొరక్క వంట ఎలా చేయాలో అర్థంకాక ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్, స్టవ్‌లు సరఫరా చేసి కట్టెల పొయ్యి బాధ నుంచి తప్పించాలని కోరుతున్నారు.

వంటగదుల్లేక తండ్లాట..

జిల్లాలో 748 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 748 ఏజెన్సీల్లో 1290 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేస్తున్నారు. నెలకు 66,953 కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.14లక్షల వరకు బడ్జెట్ మంజూరవుతోంది. ఏడో తరగతి వరకు రూ.10లక్షల బడ్జెట్ మంజూరవుతోంది. తొమ్మిది, పదో తరగతి చదివే ఒక్కో విద్యార్థికి రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా వంట చేసేందుకు సరిపడా గదుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 88 పాఠశాలలకు వంటగదులు ఉన్నాయి. మన ఊరు–మన బడి కింద చేపట్టిన 27 పనుల్లో 11 పూర్తి కాగా, 16 పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. మిగిలిన పాఠశాలల్లో రేకులషెడ్డు అనువుగా లేకపోవడంతో ఆరుబయటే వంట చేయాల్సి వస్తోంది.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలఅర్బన్: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దృష్టి సారించినట్లు తెలిపారు. సర్కారు బడులపై నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని అన్నారు. తన విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగిందని, ఉన్నత స్థానాల్లో నిలిచిన చాలామంది కూడా సర్కారు బడిలోనే చదివిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, సమయపాలను పాటిస్తూ ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. అనంతరం ప్రేమ్‌సాగర్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్, పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యమే కారణం'



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆర్కే–7 గని అటవీ లీజులో జాప్యం జరిగిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి చరిత్రలో మొదటిసారిగా గని జీవితకాలంపై గందరగోళం నెలకొందని అన్నారు. 2020 నాటికి ఫారెస్టు శాఖ ఇచ్చిన లీజు గడువు ముగుస్తుందని తెలిసినా రెన్యూవల్ కోసం సరైన ఏర్పాట్లు ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నేడు గని మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఫారెస్ట్ అనుమతి వచ్చేవరకు గని కార్మికులను ఇదే ఏరియాలో సర్దుబాటు చేయాలని అన్నారు. సీహెచ్‌పీ, ఓసీపీ, వర్క్‌షాప్, స్టోర్స్ తదితర సర్వేస్ డిపార్టుమెంట్‌లోనే ఖాళీలు ఉన్నాయని తెలిపారు. గని మూసివేసే పరిస్థితికి కారణమైన అధికారులపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి లీజును త్వరగా రెన్యూవల్ చేయించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు నాగెల్లి సాంబయ్య, గోపీనాయక్, ఉత్తేజ్‌రెడ్డి, రాజు నాయక్, మైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణిలో అధికారుల బదిలీలేవి..

- ఏళ్లుగా ఒకేచోట విధులు
- సింగరేణిని శాసిస్తున్న రాజకీయం

మందమర్రిరూరల్: సింగరేణిలో అధికారుల బదిలీల్లో జాప్యం జరుగుతోంది. జూలై మూడో వారం వచ్చినా బదిలీల ఊసే లేకపోవడంతో ఉంటాయా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. ప్రతీ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ పూర్తి కాగానే జూన్‌లోపు యాజమాన్యం అధికారుల సాధారణ బదిలీలు చేసేది. జూన్‌లోపు బదిలీల ప్రక్రియ పూర్తయితే ఎవరైన అధికారుల పిల్లలు చదువుకునే వారు ఉంటే విద్యాసంవత్సరం ఆరంభంలో ఉపయోగకరంగా ఉండేది. అధికారి హోదాను బట్టి కనీసం రెండు మూడేళ్లు ఒకేచోట విధులు నిర్వర్తించే అధికారులను యాజమాన్యం బదిలీ చేసే నిబంధనలు ఉన్నాయి. కానీ ఈ ఏడాది బదిలీలపై సందిగ్ధం నెలకొంది. సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నతాధికారుల మొప్పు పొందిన అధికారులు స్థాన చలనం లేకుండా ఒకేచోట తిష్టవేశారు. కొందరైతే ఐదేళ్లుగా బదిలీ లేకుండా ఉన్నారు. మరికొందరు పదోన్నతిపై ఏరియాలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి వారి వల్ల ఉన్నతాధికారులకు లాభం చేకూరుతుండగా.. సంస్థకు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలున్నాయి. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడం, ఇల్లందు, మణుగూరు, భూపాలపల్లి, కార్పొరేట్, హెడ్డాఫీసు ఏరియాల్లో జీఎం, ఎస్వో టు జీఎం, ఏజీఎం, ప్రాజెక్టు ఆఫీసర్స్, డీవైజీఎం, ఇంజినీర్లు, ఐఈడీ, మైనింగ్ స్టాఫ్, మేనేజర్లు, అండర్ మేనేజర్లు తదితర హోదాల్లో సుమారు 200 పైచిలుకు అధికారులు ఉంటారు. కార్పొరేట్ స్థాయిలోనే బదిలీల ప్రక్రియ జరుగుతుంది.

రాజకీయ జోక్యం

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది. నిబంధనల ప్రకారం బదిలీలు జరగడం లేదని, ఏరియాలోని హోదాను బట్టి మామూళ్ల పర్వం సాగుతోందని ఆరోపణలున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, పరిచయం ఉన్న అధికారి, మంత్రిని ప్రసన్నం చేసుకుంటే కోరుకున్న చోటుకు బదిలీ అవుతుందనే వాదనలు లేకపోలేదు.

ఘనంగా సీపీఐ నేత మల్లేష్ జయంతి



మల్లేష్ విగ్రహం వద్ద నాయకుల నివాళులు

బెల్లంపల్లి: సీపీఐ శాసనసభాపక్ష మాజీ నేత గుండా మల్లేష్ 77వ జయంతి వేడుకలు ఆదివారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. బజారుఏరియాలోని ఆయన విగ్రహానికి సీపీఐ నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ సాధారణ కార్మిక కుటుంబంలో జన్మించిన మల్లేష్ కమ్యూనిస్టు పార్టీలో చేరి అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, రెబ్బెన, గోలేటి బ్రాంచ్‌ల ఇంచార్జీ చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు జీసీ మాణిక్యం, కే.రాజేష్, బి.పూర్ణిమ, రత్నం రాజం, గుండా సరోజ, బి.రాంచందర్, స్వామిదాస్, ప్రశాంత్, ఉదయ్, రాయమల్లు, నారాయణ పాల్గొన్నారు.

అటవీ శాఖలో బదిలీల సందడి

మంచిర్యాలక్రైం: జిల్లా అటవీశాఖలో బదిలీల సందడి మొదలైంది. జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, నలుగురు కమిటీ సభ్యుల అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో 43మంది ఫారెస్టు బీట్ ఆఫీసర్లతోపాటు జిల్లాలోని అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ఆన్‌లైన్ సిస్టం ద్వారా బదిలీలు నిర్వహించారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ ర్యాంకుల ఆధారంగా, ఉద్యోగుల కుటుంబ పరిస్థితుల దృష్ట్యా నిబంధనల మేరకు పారదర్శకంగా బదిలీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ వేణుబాబు, స్థానిక ఎఫ్‌డీవో, కన్వీనర్ వినయ్‌కుమార్ సాహు, బెల్లంపెల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, చెన్నూర్ ఎఫ్‌డీఓ రమేష్ పాల్గొన్నారు.



హాజరైన అటవీశాఖ సిబ్బంది

నేడు జోనల్ పోస్టుల బదిలీలు

అటవీశాఖలో జోనల్ స్థాయి పోస్టుల బదిలీల ప్రక్రియ సోమవారం భూపాలపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించనున్నారు. జోనల్ పోస్టుల్లో ఏఓ, ఎఫ్ఆర్ఓ, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తారని తెలిసింది. మల్టీజోన్ పరిధిలో ఈ నెల 17న బదిలీలు నిర్వహించనున్నారు.

'పామాయిల్‌తో భావితరాలకు భరోసా'

వేమనపల్లి: పామాయిల్ పంట సాగు భావితరాలకు భరోసానిస్తుందని బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ అన్నారు. మండలంలోని రాజారాం, గొర్లపల్లి, జక్కెపల్లి గ్రామాల్లో జిల్లా ఉద్యానవన శాఖ, మ్యాట్రిక్స్ పామాయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పామాయిల్ ప్లాంటేషన్ మేళాలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిల్ సాగుకు ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తోందని తెలిపారు. మొక్కలు, డ్రిప్, నాటడం, సంరక్షణ అన్నింటికీ ప్రోత్సాహక నిధులు అందజేస్తోందని అన్నారు. మూడేళ్లు అంతర పంటలు వేస్తూ పామాయిల్ పంటలను కాపాడుకుంటే 30 ఏళ్ల వరకు ఎలాంటి పెట్టుబడులు లేకుండా పంట చేతికి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాట్రిక్స్ ఎగ్జిక్యూటీవ్ మధుకర్, జాయిన్ కంపెనీ ప్రతినిధి జయాకర్ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



జ్ఞాపికలు అందజేసిన రమ్యారావు, సభ్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక స్నేహ ఫౌండేషన్, కోవెళ కళానిధి(అమెరికా) ఆధ్వర్యంలో ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్యప్రదర్శనలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది చిన్నారులతోపాటు అమెరికా నుంచి వచ్చిన కోవేళ కళానిధి ప్రతినిధి డాక్టర్ రమ్యారావు(సినేహపిక్), కన్నారావు నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా రమ్యారావు మాట్లాడుతూ అమెరికాలో పుట్టి పెరిగినా భారతదేశ ప్రాచీన కళలపై ఉన్న మమకారంతో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. నృత్యప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ప్రతాప్, డైరెక్టర్ చిదానందకుమారి పాల్గొన్నారు.

మాంసం దుకాణాల్లో తనిఖీ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయించే దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ఇష్టారీతిన వ్యర్థాలు పడవేసి ఉండడంతో వారిని తీవ్రంగా హెచ్చరించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం పరిశుభ్రత పాటించకపోతే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కనకదుర్గాకాలనీలోని ఓ వైన్స్ షాపు ముందు నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కాలం చెల్లిన వంటకాలు అమ్ముతున్నట్లు తేలడంతో దుకాణం సీజ్ చేసినట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వివాహిత మృతి


చందన (ఫైల్)

భీమారం: పురుగుల మందు తాగిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై రాములు కథనం ప్రకారం.. మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన అనపర్తి చందన అదే గ్రామానికి చెందిన భర్త జంపయ్యతో రెండేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి భర్త, అత్త లక్ష్మి, మామ కనకయ్య, ఆడపడుచు వెంకటమ్మ ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించేవారు. ఈ క్రమంలో వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 7న అత్తారింట్లో చందన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి దుర్గం తిరుపతి ఫిర్యాదు మేరకు భర్త, అత్తామామలు, ఆడపడుచుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


హన్మంతు

నెన్నెల: మండలంలోని నందులపల్లికి చెందిన సోమిశెట్టి హన్మంతు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..హన్మంతు ఈనెల 13న మధ్యాహ్నం 12 గంటలకు మందు స్ప్రే చేసే డబ్బా కొనుగోలు చేసుకొని వస్తానని ఇంట్లో నుంచి రూ.30 వేలు తీసుకొని వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదు. భార్య రజిత, కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్క ఇళ్లల్లో వెతికినా ఆ చూకీ దొరకలేదు. భార్య రజిత ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వలసకూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వలసకూలీ మృతి చెందిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రపూర్‌కు చెందిన లెండుగురి హన్మంతు కుమారుడు చిన్న (19) గత కొంతకాలంగా కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వలసవచ్చాడు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఉదయం రాజీవ్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కొత్త కొత్తగా..

- జీవితం మలుపు తిరిగేది ఇంటర్‌తోనే..
- ఆకర్షణకు గురైతే భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ప్రణాళికతో ముందుకు సాగితే సక్సెస్
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు
ఆదిలాబాద్	11000
మంచిర్యాల	8552
నిర్మల్	8823
కుమురంభీం ఆసిఫాబాద్	5325
మొత్తం:	33700



ఆదిలాబాద్‌టౌన్: టీనేజ్ అత్యంత కీలక సమయం.. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిరిగేవి ఇంటర్ దశనే. అన్ని తెలుసనే ఆలోచనతో విద్యార్థులు తప్పటడుగులు వేస్తారు. ఏమాత్రం తొందరపాటు నిర్ణయాన్ని తీసుకున్నా జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్తవారు ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకు సాగితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఇప్పటికే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది దాదాపు 33,700 మంది పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. వీరు ఇంటర్ ఫస్టియర్‌లో చేరగా తరగతులు ప్రారంభమయ్యాయి.

ఆకర్షణలకు లోనైతే..

ఇంటర్ విద్యార్థులు ఆకర్షణలకు లోనవుతుంటారు. ఈదశలో అందరికి చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమజీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీకి డుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిన మాదిరిగానే కళాశాల తరగతులకు హాజరుకావాలి. పాఠ్యాంశాలపై దృష్టిపెట్టాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

చదువుపై శ్రద్ధ పెట్టాలి



ఇంటర్‌లో చేరిన విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. తెలిసీ తెలియని వయస్సులో పెళ్లి చేసుకుంటే జీవితం నాశనం అవుతుంది. అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తు అంధకారంలో వెళ్తోంది. ఈ దశనే విద్యార్థికి మలుపు.

– డాక్టర్ క్రాంతికుమార్

చెడు వ్యసనాలకు గురికావొద్దు

ఇంటర్‌లో చేరే విద్యార్థులకు చెడు వ్యసనాలకు గురి కావొద్దు. విద్యార్థులను ప్రభావితం చేసేది స్నేహం. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజంపై అవగాహన, లెక్చరర్లపై సదాభిప్రాయం ఉన్నవారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయొద్దు. అశ్లీలత వైపు మనస్సు మళ్లితే అంతే సంగతి. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. వీటితో జాగ్రత్తగా ఉండాలి.

లక్ష్యసాధన కోసం ముందుకు



విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. తల్లిదండ్రుల ఆశయసాధన కోసం ముందుకు సాగాలి. ప్రేమ, సినిమా, షికార్లకు ఆకర్షితులు కావొద్దు.

– భగవాండ్లు,
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

అంతా తెలుసనే ధోరణితో..



ఇంటర్ విద్యార్థులు అంతా తెలుసనే ధోరణిలో వ్యవహరిస్తారు. ఒక్కసారి పంజరం నుంచి విడుదలైన పక్షుల్లా అనుభూతి పొందుతారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. చెడు వ్యసనాలకు అలవాటుపడడం, కళాశాలకు డుమ్మా కొట్టడం చేస్తుంటారు. తల్లిదండ్రులు, పోషకులు పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

తల్లిదండ్రులు గమనించాలి



ఇంటర్, డిగ్రీ దశల్లోనే విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలు అలవాటుపడతారు. సరదాగా మొదలై బానిసలుగా మారుతారు. వీటిని నియంత్రించేందుకు యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి. ఆడపిల్లల్ని ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. డ్రగ్స్‌కు ప్రోత్సహించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఏసీపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమారం: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో దళిత రైతులు ఆది వారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు చిత్రపటానికి క్షీరా భిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దికల్ శివారులో ఏళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న 30 ఎకరాలను అక్రమంగా పట్టా చేసుకున్న చెర్కు సరోత్తం రెడ్డి, కట్ట నాగరాజు, మహేశ్వర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి తమకు ఏసీపీ అండగా నిలిచారన్నారు. ఆయనకు రుణపడి ఉంటామన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న దళిత మహిళలు

బైక్ మెకానిక్‌పై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని హమాలివాడకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో బైక్ మెకానిక్‌పై ఆదివారం పలువురు దాడికి పాల్పడ్డారు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. స్థానిక గాంధీనగర్‌కు చెందిన మంగరాజు అశ్విన్(36) బైక్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం మంచిర్యాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పాత కక్షలతో తన స్నేహితుడైన దీపక్ మరికొందరు కలిసి అండర్ బ్రిడ్జి వద్ద కాపుకాసి కర్రలతో దాడి చేశారు. అశ్విన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆర్కే 7 గనిని ఓసీపీగా మార్చే కుట్ర'

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనిగా మార్చే కుట్రలో భాగంగానే ఆర్కే 7 గనికి ఫారెస్ట్ లీజు అనుమతులు తీసుకోకుండా కంపెనీ అధికారులు వ్యవహరించారని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్కే 7 గని దుస్థితికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. గనుల లీజు, వాటి ప్లానింగ్ చూసేందుకు ప్రాజెక్టు ప్లానింగ్‌కు ఒక డైరెక్టర్, ముగ్గురు జీఎంలు, ఎస్టేట్స్ జీఎం ఇతర సుమారు 50 మంది అధికారులు ఉంటారని, వీరంతా ఎందుకు నిర్లక్ష్యం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లీజును పునరుద్ధరించాలి

శ్రీరాంపూర్: ఆర్కే 7 గని ఫారెస్టు లీజును సత్వరమే పునరుద్ధరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కె బాజీసైదా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫారెస్ట్ భూమి లీజు ఇవ్వడంలో జాప్యం కారణంగా గని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. 2020 నాటికి పాత లీజు పూర్తయిందని, రెన్యూవల్ ముందుగా 2018లో కంపెనీ దరఖాస్తు చేసుకుందని, ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా ఉత్పత్తిని నిలిపివేయాలని లేఖ పంపడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ విషయమై తమ యూనియన్ సింగరేణి చైర్మన్ అటవీశాఖ ముఖ్య అధికారులతో చర్చిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలి

కోటపల్లి: పత్తి చేనులో గడ్డి మందు కొట్టి మొక్కలు చంపిన అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం డిమండ్ చేశారు. మండలంలోని బొప్పారం గ్రామంలో పోడు సాగుదారులు రాజేశ్, ప్రశాంత్, సురేశ్, శంకర్‌కు చెందిన పత్తి చేన్లలో గడ్డిమందు కొట్టగా ఆదివారం ఆయన పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇప్పటికే చాలాసార్లు సాగుదారుల జోలికి వెళ్లొద్దని చెప్పినా అటవీ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు చెందిన రాజేశ్‌కు హక్కుపత్రం ఉన్నా కంచెను తొలగించి పత్తి చేనుకు గడ్డిమందు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనింగ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన ఎస్సార్పీ 3, 3ఏ గని మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ 3, 3ఏ గని ఫిట్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ(ఏఐటీయూసీ)ని ఆదివారం ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మోహన్‌దాస్, పిట్ కార్యదర్శిగా చిలుముల క్రాంతి కుమార్, అసిస్టెంట్ కార్యదర్శిగా మొహమ్మద్ మోసిన్, షిఫ్ట్ కార్యదర్శులుగా ఏ రిలే-విష్ణు, బీ రిలే- ప్రభు, సీ రిలే-వంశీ, డీ రిలే- దిలీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సాయికుమార్, కళ్యాణ్, అభిలాష్, ప్రసాద్ ఎన్నికయ్యారు. యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కె బాజీసైదా, యూనియన్ బాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి మారుపెల్లి బాపు పాల్గొన్నారు.

బీఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరాజు


శ్రీనివాసరాజు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన కారంపూడి శ్రీనివాస్‌రాజు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) సెంట్రల్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు. శ్రీరాంపూర్‌లో ఆదివారం సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ 28వ ద్వైవార్షిక సమావేశం నిర్వహించారు. మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో డెప్యూటీ సూపరింటెండెంట్ గ్రేడ్-ఏగా పని చేస్తున్న శ్రీనివాసరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మందమర్రి ఏరియా బీఎంఎస్ సింగరేణి విభాగం ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి ప్రదీప్, గని అధికారులు తదితరులు ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న నిందితుడు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఈనెల 13న అత్తను కత్తితో పొడిచి చంపిన అల్లుడు ఆపై గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. మద్యం మత్తులో గొంతు కోసుకొని రక్తపు మడుగులో ఉన్న బగవంతంవాడకు చెందిన నిందితుడు వెంకటేశ్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ఆదివారం చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడి ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట చేరి ఒకరికొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఆర్గనైజర్లు చుంచు సదానందం, ప్రకాశ్, జీవన్‌రావు, జగదీశ్, శంకర్, ప్రభాకర్, కాశినాధం, సంధ్యారాణి అండాలమ్మ పాల్గొన్నారు.



జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ముందుగా ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

నూతన గనులకు కృషి

- ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్‌గురుడే

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్‌గురుడే తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎంఎం గార్డెన్‌లో ఆదివారం బీఎంఎస్ 28వ ద్వైవార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా బొగ్గుగని కార్మికుల హక్కులు, సదుపాయాల కోసం బీఎంఎస్ కృషి చేస్తోందన్నారు. సంస్థ పరిరక్షణ కోసం పాటుపడుతామన్నారు. నూతన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలని కోరారు. అప్పుడే కొత్త గనులు వస్తాయన్నారు. తద్వారానే సంస్థ మున్ముందు మనుగడ సాధిస్తుందన్నారు. బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యులు ఆశీస్‌మూర్తి, నాయకులు రాంమోహన్, మాధవ్ నాయక్, మండ రమాకాంత్, బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

బీఎంఎస్ కేంద్ర కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదగిరి సత్తయ్య మళ్లీ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యతిపతి సారంగపాణి, ఉప ప్రధాన కార్యదర్శిగా పి.వేణుగోపాల్ రావు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చాట్ల అశోక్, కారంపూడి శ్రీనివాస్‌రాజు, బానోత్‌రాంసింగ్, కార్యదర్శిగా రవీందర్, అనుప రమేశ్, రాగ రాజేందర్, జీడి ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పి.వినయ్‌కుమార్, అయిలవేని శ్రీనివాస్, చెట్టు వీరన్న, ఊరవకొండ తిరుపతి, కోశాధికారిగా ఆకుల హరీశ్ ఎన్నికయ్యారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి భూడిదగడ్డ బస్తీలో దళిత ఒంటరి మహిళపై దాడి చేసి, ఆమె తల్లిదండ్రులను కులం పేరుతో దూషిస్తున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. ఆదివారం బెల్లంపల్లిలో దాడికి గురైన దళిత మహిళల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఏసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటరి మహిళ ఎర్ర లావణ్యతో సంతోష్ తరచూ గొడవకు దిగి దాడి చేస్తున్నాడని ఆరోపించారు. ఆమె ఇంటి స్థలాన్ని కబ్జా చేయడానికి సంతోష్ ఆమె తల్లిదండ్రులను కులం పేరుతో దూషించి అవమానించారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో సంతోష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపారు. సాక్ష్యం చెప్పకుండా నిందితులు బెదిరిస్తున్నారని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కోరారు. బాధితులు లావణ్య, లక్ష్మీ,ప్రియ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న నాయకులు, బాధితులు

వేజ్ ప్రొటక్షన్ కల్పించాలి

- సర్ఫేస్ జనరల్ మజ్దూర్ నిబంధనలపై సీనియర్ కార్మికుల పెదవి విరుపు
- ఈ నెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని కేటగిరిలకు వర్తించినా ప్రయోజనం శూన్యం

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీలో వేజ్ ప్రొటక్షన్ కల్పించాలని సీనియర్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నాళ్లు ఖాళీల కోసం వేచి అండర్‌గ్రౌండ్‌లోని అన్ని కేటగిరీ కార్మికులకు నేడు కంపెనీ ఇచ్చిన దీని నోటిఫికేషన్ ఏమాత్రం రుచించడం లేదు. ఆశపడి భంగపడ్డామని కార్మికులు వాపోతున్నారు. అన్ని ఏరియాల్లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీకి కంపెనీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో మొత్తం 108 ఖాళీలు సూచించింది. వీటికి ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అన్ని కేటగిరీలకు అవకాశం..

మొదటిసారిగా అండర్ గ్రౌండ్‌లో పనిచేసే అన్ని రకాల కేటగిరీల వారికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు అవకాశం కల్పించారు. ఇంతకు ముందు కేవలం అండర్ జనరల్ మజ్దూర్ వారికే అవకాశం ఉండేది. మిగతా కేటగిరీలకు వారికి లేదు. దీనిపై ఇటీవల గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో మాట్లాడి అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పించాలని కోరారు. కంపెనీ మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్‌లను మినహాయించి మిగిలిన అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. చాలామంది యువ కార్మికులు ట్రామర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్, కోల్‌కట్టర్, సపోర్టుమెన్ల యాక్టింగ్‌లు చేస్తున్నారు కాని ఆయా కేటగిరీల్లో చేరడానికి లెటర్లు తీసుకోవడానికి అయిష్టత చూపుతూ జనరల్ మజ్దూర్లుగా ఉంటున్నారు. దీంతో చాలా ఖాళీలు మిగులుతున్నాయి. కారణం సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్లు పడితే ఆయా కేటగిరీ వారికి అవకాశం లేకపోవడమే. ఈక్రమంలో కంపెనీ అన్ని కేటగిరీల వారికి అవకాశం కల్పిస్తే వారు చేరుతారని ఆశించి ఉత్తర్వులు ఇచ్చింది.


గనిలో పని చేస్తున్న సపోర్టుమెన్లు (ఫైల్)

ఆర్థికంగా నష్టమే..

అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే సీనియర్ కార్మికులకు, ఇతర కేటగిరీల వారికి ఆర్థికంగా నష్టం వస్తుంది. నెల వేతనంతోపాటు భవిష్యత్తులో పెన్షన్, గ్రాట్యూటీలో భారీ నష్టం వస్తుందని కార్మికులు పేర్కొంటున్నారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు కంపెనీ అందరికి అవకాశం కల్పించిన దాన్ని సద్వినియోగం చేసుకోకుండా కంపెనీ నిబంధనలు ప్రతిబంధకంగా మారాయి. 1వ కేటగిరీ కావడం, అండర్‌గ్రౌండ్ నుంచి ఎవరు వచ్చి చేరిన వారి పాత వేతనం రాదు. బేసిక్ ప్రొటక్షన్ కల్పించకపోవడంతో సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు వస్తే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు మాత్రమే ప్రయోజకారిగా ఉత్తర్వులు ఉన్నాయి. అండర్ గ్రౌండ్‌లో 5వ కేటగిరీలో పని చేస్తున్న కార్మికుడు మజ్దూర్‌గా చేరితే అతనికి మొదటి కేటగిరీ వేతనమే ఇస్తారు. అప్పటి వరకు ఇంక్రిమెంట్లు ఉంటే వాటిని మొదటి కేటగిరీ వేతనంను కలిపి బేసిక్‌ఫిక్స్ చేస్తారు. రూ.వేలల్లో వేతనం తగ్గిపోతుంది. అతనికి ప్రమోషన్ వచ్చుడేమో కాని వేతనం ప్రకారం చూస్తే డీ ప్రమోట్ అయినట్లేనని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కంపెనీ వేజ్‌ప్రొటక్షన్ కల్పించి వీటిని భర్తీ చేయాలని సీనియర్ కార్మికులు పేర్కొంటున్నారు.